యూనిఫాం అందేనా..?

ఒక జత యూనిఫాంకు రూ.50 అందిస్తున్న ప్రభుత్వం

- గిట్టుబాటు ధర కావడం లేదంటూ దర్జీల జాప్యం
- నత్తనడక సాగుతున్న కుట్టు పనులు
- ధర పెంచాలని అధికారులపై ఒత్తిడి
- ప్రారంభం నాటికి ఒక జత అయినా అందించాలని అధికారుల ప్రయత్నం

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా నూతన ఏకరూప దుస్తులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడు విద్యా సంవత్సరానికి దుస్తులు అందించాలని ప్రభుత్వం ఆయా నియోజకవర్గాల్లోని మండలాల్లో దుస్తులు కుట్టుటకు ఏజెన్సీలకు అప్పగించింది. ఒక జతకు ప్రభుత్వం నుంచి రూ.50 అందిస్తుంటే ప్రైవేట్‌లో దీనికి నాలుగు రెట్లు అధికంగా డబ్బులు వస్తున్నాయని దర్జీలు కుట్టుడుపై అంతగా ఆసక్తి కనబరచడం లేదు. ఈనేపథ్యంలో ఉన్నతాధికారులు నిర్ణయించిన ధరకే కుట్టమని ఉపాధ్యాయులు దర్జీలను కోరుతున్నా.. ధర పెంచాలని దర్జీలు ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు.



సదాశివాపురం ప్రభుత్వ పాఠశాల (ఇన్‌సెట్) నేలకొండపల్లి ఎంఈఓ కార్యాలయంలోని వస్త్రాలు(ఫైల్)

నేలకొండపల్లి: పాలేరులో నియోజకవర్గంలో కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లో దాదాపు 10 వేల మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాల్సి ఉంది. ఒక్క నేలకొండపల్లి మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలు–11, ఉన్నత పాఠశాలలు–13, ప్రాథమిక పాఠశాలలు–36 ఉండగా.. మొత్తం 2,550 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికి పాఠశాలలు పునఃప్రారంభం నాటికి రెండు జతల ఏకరూప దుస్తులు అందిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణ సాధ్యమయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

సమస్యగా మారిన కుట్టుకూలి..

ఒక జత కుట్టినందుకు ప్రభుత్వం కేవలం రూ.50 మాత్రమే అందిస్తున్నారు. కానీ ప్రస్తుతం పెరిగిన మెటీరియల్ ధరలకు అనుగుణంగా కనీసం రూ.200 లేనిదే తమకు గిట్టుబాటు కాదంటూ దర్జీలు నిరాసక్తి చూపుతున్నారు. కొన్నిచోట్ల కుట్టేందుకు ముందుకు వచ్చినా నాసిరకం మెటీరియల్‌తో కుట్టే అవకాశం ఉండడంతో అవి త్వరగానే చినిగిపోతాయని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, వయస్సుల వారిగా కొలతలతో దుస్తులను కుట్టాల్సి ఉంటుంది. చిన్నారులకు షర్టు, గౌన్లకు పట్టీలు, పెద్దవారికి కాలర్ పట్టీలు, కోట్ బొక్కాలు, జేబులు, భుజాలపై క్లాంపులు, చేతి భాగంలో క్లిప్పులు కుట్టాల్సి ఉంటుంది. ఒక జతకు రూ. 50 చొప్పున రెండు జతలకు రూ.100 ఇస్తే ఏం సరిపోతాయని దర్జీలు పేర్కొంటున్నారు.

పేద పిల్లలంటే నిర్లక్ష్యం..



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందించే దుస్తులు పట్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రూ.50తో కుట్టు కూలి ఎలా సరిపోతాయి. డిజైన్ మార్చారు.. కానీ ధర మాత్రం పెంచలేదు. నాణ్యత ఉండాలంటే కూలి ధర పెంచాల్సిందే.

– జీ.మస్తాన్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి. ఖమ్మం

ఒకేసారి రెండు జతలు ఇవ్వాలి..



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బడులు ప్రారంభం రోజునే రెండు జతల యూనిఫామ్ అందివ్వాలి. బడుల పట్ల నమ్మకం కలిగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రతి ఏటా నెలలు తరబడి జాప్యం చేసినట్టు కాకుండా ఈసారి వెంటనే అందించే చర్యలు చేపట్టాలి.

– గరిడేపల్లి రామారావు, సుర్దేపల్లి

చర్యలు తీసుకుంటున్నాం..



పాఠశాలలు ప్రారంభం నాటికి కనీసం ఒక జత ఏకరూప దుస్తులు అందించేలా చర్యలు తీసుకున్నాం. ఈనెల 31లోపు ప్రతీ పాఠశాలకు కనీసం ఒక జతైనా చేరతాయి. నాసిరకం కుట్టు విషయంపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చూసుకోవాలని ఆదేశించాం.

– బీ.రాములు, ఎంఈఓ, నేలకొండపల్లి

క్లుప్తంగా

సన్మానం..

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండాకు చెందిన ధారావత్ రాధాకృష్ణమూర్తి గౌరవ డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆయన నివాసంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవ కార్యక్రమాలు ఇంకా మరిన్ని చేపట్టి గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల స్థాయి వరకు విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, నాయకులు భూక్యా సీత్యా నాయక్, చిన్నానాయక్, సూరేపల్లి రవి, యాతాకుల శ్రీనాథ్, గెల్లా శ్రీనివాసరావు, ధనవత్ సైదులు, హేమ్లా, నరేష్, గుగులోత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నేలకొండపల్లి: శ్రీ వాసవీ సేవా సమితి తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నేలకొండపల్లికి చెందిన పసుమర్తి శ్రీనివాస్‌ను నియమిస్తూ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్‌శెట్టి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల పాటు పదవీలో కొనసాగుతారని ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య జాతి ఆర్థిక, సామాజిక, రాజకీయ వైభవాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మజ్జిగ పంపిణీ..

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని చలివేంద్రంలో ఆదివారం భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు పాలడుగు పూర్ణచందర్‌ప్రసాద్ మాట్లాడుతూ .. ప్రజల దాహార్తిని తీర్చేందుకు సొసైటీ ద్వారా ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ప్రతినిధులు గెల్లా జగన్‌మోహన్‌రావు, వల్లంచెట్ల భాస్కర్‌రావు, లింగస్వామి, యలమద్ది లెనిన్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వం ఇస్తున్న సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభమైనట్లు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కోడి లింగయ్య, గౌరవాధ్యక్షుడు వి.వెంకన్న, జిల్లా అధ్యక్షుడు గుగులోతు బిక్కులు తెలిపారు. ఆదివారం సంఘం జిల్లా కార్యాలయం వద్ద సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని శాఖల అధ్యక్ష, కార్యదర్శులు సభ్యత్వాలను త్వరితగతిన పూర్తి చేసి వచ్చే నెల 10వ తేదీలోగా జిల్లా కమిటీకి రశీదు పుస్తకాలు అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, మాధవి, అంజమ్మ, రాంప్రసాద్, రాజు, హమీద్, ఇమ్రాన్ ఖాన్, చావా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కూలీలు వడదెబ్బకు గురికాకుండా చూడాలి

తిరుమలాయపాలెం: ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు అంగిరేకుల నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పలు గ్రామాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడి పని ప్రదేశాలలో వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందివ్వాలని, ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు అధిక వేతనాలు చెల్లించాలని కోరారు.

ఘనంగా పెంతుకోస్తు పండుగ

ఖమ్మంగాంధీచౌక్: పరిశుద్ధంగా జీవించే వారిమీదకి దేవుని పరిశుద్ధాత్మ వస్తుందని, వారు ఈ లోకంలో ఆయనకు సాక్షులుగా ఉంటారని, పరుశుద్ధాత్మ దిగివచ్చి ధర్మశాస్త్రం ఆమోదించబడిన దినమే పెంతికోస్తు పండుగ అని ఫాస్టర్ పాలడుగు రత్నపాల్ అన్నారు. ఆదివారం నగరంలోని రమణగుట్టలోని యావె సమాజ ప్రార్థన మందిరంలో నిర్వహించిన పెంతికోస్తు పండుగ మహోత్సవంలో ఆయన మాట్లాడారు. బైబిల్‌ను ప్రామాణికంగా తీసుకుని సత్యవాక్యాన్ని గ్రహించి ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సుజాత, మోసే, దానియేలు, వివేక్, ప్రశాంత్, ఏలీయా, సామేలు, పుష్పమ్మ పాల్గొన్నారు.

బీజేపీ నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ఉద్యోగాల పేరిట యువతీ, యువకులను మోసం చేసిన బీజేపీ ఖమ్మంలో నిరుద్యోగ మార్చ్ నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఆదివారం జరిగిన సీపీఎం సెంటర్ సెల్, ఖమ్మం నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో నెలకొన్న ఖాళీలను కూడా భర్తీ చేయని అసమర్థ బీజేపీ ఎన్ని ప్రయత్నాలు చేసినా బీజేపీకి ఖమ్మం జిల్లాలో స్థానం లేదన్నారు. నిరుద్యోగ మార్చ్‌లో ఉన్నదల్లా బీజేపీ రాజకీయ నిరుద్యోగులే అని ఎద్దేవా చేశారు. అధికారం కోసం బీజేపీ అన్ని రకాలుగా దిగజారిపోయిందన్నారు. ఎవరైనా నాయకులు ప్రలోభాలకు తలొగ్గి బీజేపీలోకి వచ్చినా వారిని ఆదరించే పరిస్థితి జిల్లాలో లేదన్నారు. కమ్యూనిస్టుల గురించి మాట్లాడే నైతికత బండి సంజయ్‌కి లేదన్నారు. నైజాం నవాబును, రజాకార్ల ఆగడాలను ఎదుర్కొన్న చరిత్ర జిల్లాకు ఉందని, కాషాయ మూకల ఆటలు సాగవని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, బండారు రమేష్, ఎం.సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన సుతారి కూలి..



మాట్లాడుతున్న బండి జయకిషోర్

ఖమ్మంమయూరిసెంటర్: భవన నిర్మాణ కార్మికులకు కూలీ రేట్లు పెంచినట్లు క్రెడాయి ఖమ్మం అధ్యక్షుడు బండి జయకిషోర్, బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంపాల కృష్ణమోహన్, క్రెడాయి బాధ్యుడు కొప్పు నరేష్ తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో భవన నిర్మాణదారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. భవన నిర్మాణదారులతో చర్చించి ప్రస్తుతం ఇస్తున్న కూలికి అదనంగా 12 శాతం పెంచినట్లు క్రెడాయి, బిల్డర్స్ అసోసియేషన్ బాధ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సుతారి కూలి రూ.800 నుంచి రూ.900, మగ కూలి రూ.570 నుంచి రూ.640 కాగా ఆడ కూలి రూ.550 నుంచి రూ.620లకు పెంచినట్లు తెలిపారు. 28వ తేదీ నుంచే పెరిగిన రేట్లు అమల్లోకి వస్తాయని, రోజూ ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పని చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో క్రెడాయి గౌరవ సలహాదారులు గరికపాటి ఆంజనేయ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి దోసపాటి ప్రవీణ్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, చేరుకమల్లి వెంకటేశ్వరరావు, తంగిళ్లపల్లి శ్రీనివాస్, ఖమ్మం సిటీ బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రెడాయి ఖమ్మం సభ్యులు పాల్గొన్నారు.

వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే..



మాట్లాడుతున్న మహ్మద్ జావీద్

రఘునాథపాలెం: జోడో యాత్ర, పీపుల్స్ మార్చ్‌లతో దేశ, రాష్ట్రాల్లో మార్పు మొదలైందని, త్వరలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమేనని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ అన్నారు. ఆదివారం మండలంలోని కోయచెలక, కోటపాడు, చిమ్మపుడి, సూర్యతాండా, ఈర్లపుడి తదితర గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర స్ఫూర్తిగా జన నాయకుడు, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క రాష్ట్రంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేపట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సకల తెలంగాణ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పీపుల్స్ మార్చ్ సభ సమన్వయకర్త పసుపులేటి దేవేంద్రం, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు భూక్యా బాలాజీ, కోటపాడు సర్పంచ్ రమణ సుధాకర్ యాదవ్, నాయకులు మలీదు వెంకటేశ్వర్లు, వెంకన్న, సత్యం బాబు, బీహెచ్ రబ్బానీ, మాధంశెట్టి హనుమంతరావు, చెరుకూరి సీతారాములు, జోనాబోయిన పాపయ్య, నాగేశ్వరావు, తెజావత్ ఉపేందర్, శివాలాల్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఖమ్మంగాంధీచౌక్: రంగారెడ్డి జిల్లా గోపన్‌పల్లిలో ఈ నెల 31న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించబడుతున్న బ్రాహ్మణ భవనం ప్రారంభోత్సవానిని ధూపదీప నైవేద్య అర్చలకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నారు. ప్రసాద్‌శర్మ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మునగలేటి రమేష్‌శర్మ, మరింగంటి భార్గావా చార్యులు ఆదివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు.

శ్రీ షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవ వేడుకలు..

ఖమ్మం ఖానాపురంహవేలి విజయనగర్ కాలనీలో ఈ నెల 30న శ్రీ షిర్డీ సాయిబాబా మందిర 16వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజా కార్యక్రమాలతో పాటు అన్నదానం కూడా ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రజా గర్జన బహిరంగ సభ..

ఖమ్మంరూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజా గర్జన బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని ఏదులాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎర్రజెండా అండగా సీపీఐ ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసిందని తెలిపారు. ఈ సభ సాక్షిగా మతోన్మాద రాజకీయాలు, ఎన్నికల్లో పాలకులు ఇచ్చిన హామీల అమలుకై సమరశంఖం పూరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, రాము, రమణ, నాగేశ్వరరావు, పుల్లయ్య, రామయ్య, రమేష్, వీరయ్య, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

ఖమ్మంమయూరిసెంటర్: వందకు పైగా కంపెనీలతోఖమ్మం నగరంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన సోమవారం మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే ఈ జాబ్ మేళాకు ఏడో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు చదువుకున్న వారు అర్హులని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు, చెవిటి, మూగ, దివ్యాంగులకు కూడా అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. కావున ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పొంగులేటి పర్యటన..

ఖమ్మంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం పర్యటించనున్నట్లు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథపాలెం మండలం బూడిదంపాడు, ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్, టీఎన్జీవోస్ కాలనీల్లో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొత్త రవి

నేలకొండపల్లి: జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఫ్యాన్స్ పట్టణ కమిటీని ఎన్నుకున్న సందర్భంగా పలువురు మాట్లాడారు. అధ్యక్షుడిగా కొత్తా రవి, ఉపాధ్యక్షుడిగా జూలకంటి గోపి, కార్యదర్శిగా మస్తాన్, ప్రధాన కార్యదర్శులుగా పసుపులేటి సతీష్, శివలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు జీవీఆర్, ఉపాధ్యక్షుడు అబ్దుల్లా, ఎన్టీకే ఫ్యాన్స్ మండల అధ్యక్షుడు వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	2018
సాయిరాం	మళ్లీ పెళ్లి
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	మేమ్ ఫేమస్
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మంగాంధీచౌక్

కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి



ఏదులాపురంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ఖమ్మంరూరల్: మండలంలోని అర్హులైన దళితులకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసి జీవనోపాధి కల్పించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఆరేకోడు, ఏదులాపురంలలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళితవాడల సమస్యలపై సర్వే నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దళిత బంధుకు అధిక నిధులు కేటాయించి నియోజకవర్గానికి ఎక్కువ యూనిట్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలు 40 ఏళ్ల క్రితం నిర్మించడంతో నేడు అవి శిథిలావస్థకు చేరుకున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితుల స్థితిగతులపై స్పందించకపోతే కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.మధు, ఎ.శంకర్, ఎం.శివ, రామారావు, రవి, రాము, వీరభద్రం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'పోడు'కు హక్కు పత్రాలు ఇవ్వాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

ఖమ్మం అర్బన్: పోడు భూములు సాగుచేస్తున్న రైతులందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని ఆలిండియా బంజారా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని బంజారా భవన్‌లో ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో బానోత్ బస్కినాయక్, ధరావత్ రామ్మూర్తి నాయక్, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, బానోత్ కిషన్ నాయక్ తదితర నాయకులు మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ పేద రైతు అర్హులేనని, గత దశాబ్దాలుగా పోడు రైతులపై ప్రభుత్వాలు అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి గిరిజన సంఘాలు ఐక్యంగా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ చంద్రం నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సుశీల బాయ్, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ కుమార్, తేజావత్ కృష్ణకాంత్, తెలంగాణ గిరిజన సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర కిషన్ నాయక్‌తో పాటు బానోత్ తారదేవి, మోతిలాల్ నాయక్, తేజావత్ అనిల్ నాయక్, అజ్మీర మాన్‌సింగ్, బానోత్ ఫుల్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేత



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న దాతలు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ, గురుకుల కళాశాలల విద్యార్థులకు శ్రీమిత్ర ఫౌండేషన్, సామినేని వ్యాజ్యయయ్య మెమోరియల్ ట్రస్ట్, తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఆదివారం ఖమ్మం లేక్‌వ్యూ క్లబ్‌లో మిత్రా ఫౌండేషన్ చైర్మన్ కురువేళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరుగురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిందని, భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జైశేఖర్, ప్రముఖ హాస్యనటుడు శ్రీనివాసరెడ్డి, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, జిల్లా ఎన్నారై ఫౌండేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మిత్రా గ్రూపు డైరెక్టర్లు చెరుకూరి యుగంధర్, పాలవరపు శ్రీనివాస్, డాక్టర్ వణుకురు నరసింహారావు, రంగా శ్రీనివాసరావు, చారుగుండ్ల రవికుమార్, బొమ్మిడి సునిల్‌కుమార్, నాగరాజు దేవర వేములూరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతకు పూజలు

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చే నెల 8, 9, 10వ తేదీల్లో గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, గ్రామ దేవతల ఆలయాల ప్రారంభోత్సవాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, గ్రామస్తులు ఎం.సాయన్న, చల్లా హరి, గంగరాజు, నాగేంద్రబాబు, డి.రామారావు, మాధవరావు, సురేందర్, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

31న శ్రీరామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన భద్రాద్రి సీతాలక్ష్మణ శ్రీరామచంద్ర స్వామి ఆలయం, ధ్వజస్తంభం ప్రతిష్ఠాత్మక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. గ్రామంలో 28న ధ్వజస్తంభం, విగ్రహాల ఊరేగింపు, 29, 30వ తేదీల్లో ప్రత్యేక హోమాలు, పూజలు, శాంతి హోమం, రక్షాసుదర్శన, జలాధివాసం కార్యక్రమాల అనంతరం 31న అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఆలయానికి విరాళం..

ఖమ్మం అర్బన్: మండలంలోని కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్ సమీపంలోని శ్రీ అంకమ్మ శ్రీ మహాలక్ష్మమ్మ శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల నూతన దేవాలయ నిర్మాణానికి చారుగుండ్ల ప్రతాప్‌బాబు, సత్యసుధ దంపతులు రూ.10,116 విరాళం అందించారని ఆలయ కమిటీ తెలిపింది.

ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న కేఎల్ఎన్ శర్మ

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని వైకుంఠధామాలలో అంత్యక్రియలు నిర్వహించే జాంబవంతుడు కాటికాపరి, సొసైటీకి చెందిన కాటికాపరుల ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి బాలుకు ఆదివారం తల్లిదండ్రులు బుద్ధారం పిచ్చయ్య, వెంకటనర్సమ్మల జ్ఞాపకార్థం ప్రముఖ న్యాయవాది కేఎల్ఎన్ శర్మ రూ.10 వేల చెక్కును వారి నివాసంలో భార్య శిరీషతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్ఎన్ శర్మ మాట్లాడుతూ.. కాటికాపరులు అనాథలు, వృద్ధులు, భిక్షటకులకు అన్నదానం, పండ్లు పంపిణీ వంటి సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పండి వేణు, పడిశాల వీరస్వామి, కాశయ్య, తరుణ్, సైదులు, చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు

దివంగత మాజీ ముఖ్యమంత్రి, సినీ నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా ఆదివారం టీడీపీ, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో నాయకులు ఆయా మండల కేంద్రాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించడంతో పాటు అన్నదానం చేశారు. అనంతరం ఎన్టీఆర్ తెలుగుజాతికి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరి సెంటర్: ఎన్టీఆర్ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి



ఎన్టీఆర్ సర్కిల్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నేతలు, అభిమానులు



కూసుమంచి: కేక్ కట్ చేస్తున్న అభిమానులు



రఘునాథపాలెం: అన్నదానం చేస్తున్న తెలుగుదేశం పార్టీ ఎన్నారై పోర్ట్ ల్యాండ్ విభాగం బాధ్యులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్.ఉపేందర్ - 99591 24151 | ఖమ్మం-1 కె. సురేష్ - 90631 99777
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | మధిర వీరబాబు - 98498 64638
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎన్. శేషయ్య - 99121 99148
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957
ఎన్. జయరాజు - 96528 68642